సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం ၊ 1 ၊ డిసెంబర్ ၊ 2024



మా స్థలాలు తీసుకునేందుకు మీరెవరు?

పులివెందుల పట్టణంలోని కోతి సమాధి ఆలయం సమీపంలో ఉన్న డీకేటీ స్థలాలను టీడీపీ నాయకులు ఆక్రమించేందుకు సిద్ధమవ్వడంతో స్థానికులు అడ్డుకున్నారు. -8లో



మట్టికోసం తవ్వుతుంటే బయటపడ్డ గుహ

కొండాపురం మండల పరిధిలోని ముచ్చుమర్రి శివాలయం సమీపంలోగల కొండలో మట్టిని తవ్వుతుండగా గుహ బయటపడింది. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
25.6/23.4

జిల్లాలో శనివారం 23.4 – 25.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

అధికారులకు శిక్షణ

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో చేపట్టిన పనుల నుంచి తగ్గింపు చేసిన జీఎస్టీ, క్యూసీ, న్యాక్, లేబర్ సెస్ మొత్తాలను వెంటనే సంబంధిత శాఖల హెడ్ ఆఫ్ అకౌంట్లకు జమ చేసే విధానంపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర జీఎస్టీ అధికారులు హాజరయ్యారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న పశువుల షెడ్లు, సీసీ రోడ్ల పనుల పురోగతిపై జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు సమీక్షించారు.

8న క్రీడా జ్ఞాన్ పరీక్ష

కడప స్పోర్ట్స్: క్రీడాభారతి కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ 8వ తేదీన ఆన్‌లైన్ విధానంలో 4వ 'క్రీడా జ్ఞాన్ పరీక్ష' నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా డీఎస్‌డీఓ ఎస్. గౌస్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు, విద్యార్థులు, పేరెంట్స్, సిటిజన్స్ ఈ పరీక్ష రాసేందుకు ఆన్‌లైన్ ద్వారా క్రీడాభారతి.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో ఆధార్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పరీక్ష 8వ తేదీ ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటలలోపు ఎప్పుడైనా రాసే వెసులుబాటు ఉందన్నారు. 50 ప్రశ్నలు, 25 నిమిషాల సమయం ఉంటుందన్నారు. 12 సంవత్సరాలు పైబడిన వారందరూ అర్హులేనని పేర్కొన్నారు.

జిల్లాలో సీఐల బదిలీ

కడప అర్బన్: కర్నూలు, అనంతపురం రేంజ్‌ల పరిధిలో పనిచేస్తున్న సీఐలలో 26 మందిని బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డిఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులను జారీ చేశారు. అన్నమయ్య జిల్లా వీఆర్‌లో ఉన్న ఎ.చాంద్‌బాషాను నంద్యాల డీటీసీకి, ఆత్మకూరు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో (యూపీఎస్) పనిచేస్తున్న ఓబులేసును కడప చిన్నచౌక్ యూపీఎస్‌కు, ఒంటిమిట్ట సర్కిల్‌లో పనిచేస్తున్న హెచ్.కృష్ణంరాజు నాయక్ కడప వీఆర్‌కు, అన్నమయ్య జిల్లా వీఆర్‌లో ఉన్న టి బాబును వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట సర్కిల్‌కు, టి.బాబును ఆర్‌వ్యాలీ నుంచి వైఎస్సార్ జిల్లా సోషల్‌మీడియా సైబర్ క్రైమ్‌కు, చిత్తూరు జిల్లాలో వీఆర్‌లో ఉన్న కె.ఉలసయ్యను ఆర్‌కేవ్యాలీకి, యు.వెంకటకుమార్‌ను వైఎస్సార్ జిల్లా ఎస్‌బీ-1 నుంచి వైఎస్సార్ జిల్లా వీఆర్‌కు, వైఎస్సార్ జిల్లా వీఆర్‌లో ఉన్న టి.రెడ్డెప్పను వైఎస్సార్ జిల్లా ఎస్‌బీ-1కు, అన్నమయ్య వీఆర్‌లో ఉన్న పి.సురేంద్రరెడ్డిని వైఎస్సార్ జిల్లా ఎస్‌బీ-2కు, వైఎస్సార్ జిల్లా వీఆర్‌లో ఉన్న జి.ఈదురుబాషాను ఏహెచ్‌టీయూ వైఎస్సార్ జిల్లాకు, అన్నమయ్య జిల్లా ఆర్ఎస్ఏటీఎఫ్‌లో పనిచేస్తున్న టి.నరసింహులును పులివెందుల యూపీఎస్‌కు, బి కొత్తకోట సీఐ కే రాజారెడ్డిని అన్నమయ్య జిల్లా ఎస్‌బీ-3కి, జి.జీవన్‌గంగనాథ్‌బాబున పులివెందుల యూపీఎస్ నుంచి బి.కొత్తకోట యూపీఎస్‌కు, అన్నమయ్య జిల్లాలో వీఆర్‌లో ఉన్న టి మధును ఇదే జిల్లా ఎర్రచందనం రక్షణ విభాగానికి, అన్నమయ్య జిల్లా ఎస్‌బీ-1లో టివి సత్యనారాయణను అన్నమయ్య వీఆర్‌కు, అన్నమయ్య ఎస్‌బి-3లో ఉన్న పిరాజా రమేష్‌ను ఎస్‌బి-1కు, అన్నమయ్యకు, అన్నమయ్య డీసీఆర్‌బీలో పనిచేస్తున్న జె శంకరయ్యను అన్నమయ్య వీఆర్‌కు, అనంతపురం వీఆర్‌లో ఉన్న ఎం తులసీరామ్‌ను అన్నమయ్య డీసీఆర్‌బీకి బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులను విడుదల చేశారు.

హౌసింగ్‌లో..
అవినీతి రేసింగ్!

- పక్కదారి పట్టిన ఐరన్, సిమెంట్ బస్తాలు
- కమలాపురంలో హౌసింగ్ అధికారుల చేతివాటం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఉన్నతాధికారులు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు



❑ ఈమె పేరు గంగమ్మ. వల్లూరుకు చెందిన ఈమెకు పక్కా ఇళ్లు మంజూరైంది.బేస్‌మట్టం వరకు నిర్మించుకుంది. ఆపై స్తోమత లేక పనులు నిలిచిపోయాయి. సిమెంట్ కోసం హౌసింగ్ అధికారుల వద్దకు వెళితే, అప్పటికే 40 బస్తాలు తీసుకున్నట్లుగా ఆన్‌లైన్‌లో చూపించారు. సిమెంట్ తీసుకోకపోయినా తీసుకున్నట్లు సంతకాలు రిజిస్టర్‌లో ఉన్నాయి. తమకు ఎలాంటి సిమెంట్ ఇవ్వలేదని గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.



❑ ఈమె పేరు ఎర్రక్క. కమలాపురం మండలం సంబటూరు గ్రామంలో పక్కా ఇళ్లు మంజూరైంది. బేస్‌మట్టం వరకూ ఇళ్లు నిర్మించుకున్నారు. ఈమె పేరిట 200 కిలోలు స్టీల్, విండో, 3ఇసుక కూపన్లు జారీ అయ్యాయి. ఇవన్నీ ఎర్రక్కకు తెలియకుండానే రికార్డుల్లో ఉన్నాయి. వీటి విలువ ప్రభుత్వ గణాంకాలు ప్రకారం రూ.22వేల పైబడి ఉంది. నాకెప్పుడు ఇనుప కడ్డీలు ఇచ్చారు. ఇసుక ఎక్కడిదని ఎర్రక్క నిలదీస్తోంది.



సాక్షి ప్రతినిధి, కడప: జిల్లాలో హౌసింగ్ శాఖలో అవినీతి రేసింగ్ కొనసాగుతోంది. మరీ ముఖ్యంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అవినీతి పర్వం జోరందుకుంది. లబ్ధిదారులకు తెలియకుండానే వారికి మంజూరైన సిమెంట్, ఇనుప కడ్డీలు, కిటికీలు ఎంచక్కా స్వాహా చేస్తున్నారు. ముఖ్యంగా కమలాపురం నియోజకవర్గంలో ఈతంతు అధికంగా తెరపైకి వస్తోంది. అక్కడి హౌసింగ్ అధికారులు అధికారపార్టీ నేతల అండదండలతో తమ 'ప్రతాపా'న్ని చూపిస్తున్నారు. లబ్ధిదారులకు మంజూరైన సిమెంట్ ఇవ్వకుండా ఫోర్జరీ సంతకాలతో స్వాహా చేసిన ఉదంతం తెరపైకి వచ్చింది. విజిలెన్స్ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తే నిజాలు వెల్లడవుతాయని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇలాంటి పరిస్థితి జిల్లా అంతా ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ చొరవ లేక పెండింగ్‌లో గృహనిర్మాణం

జిల్లా వ్యాప్తంగా 436 హౌసింగ్ లేఅవుట్లల్లో 1,02,770 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరయ్యాయి. అందులో 94,060 మంది పేరిట రిజిస్టర్ కూడా అయ్యాయి. 15,141 ఇళ్లు మినహా తక్కినవి నిర్మాణంలో ఉన్నాయి. అందులో 32,821 ఇళ్లు పూర్తికాగా, రూఫ్ లెవెల్లో 10,863, రూఫ్ కాస్ట్ పరిధిలో 10,305 ఇళ్లు, బేస్‌మెంట్ లెవెల్లో 30,111 ఇళ్లు ఉన్నాయి. బిలో బేస్‌మట్టం లెవెల్‌లో 3,529 ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో చేపట్టిన ఈ పథకం పట్ల కూటమి ప్రభుత్వం ఆశించిన చొరవ చూపలేదు.

- 'గోరుచుట్టుపై రోకటి పోటు'అన్నట్లుగా లబ్ధిదారులకు మంజూరైనవి సొంతంగా పూర్తి చేసుకోలేకపోగా, ప్రభుత్వం చొరవ లేక అల్లాడుతున్న పేదలకు మంజూరైన సిమెంట్, ఐరన్‌ను హౌసింగ్ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూ స్వాహా చేసినట్లు ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్నాయి. ఇలా స్వాహా అయిన విషయాన్ని తెలుసుకొని లబ్ధిదారులు వాపోతున్నారు. తమ పేరిట మంజూరైన సిమెంటు, ఐరన్ తీసుకోపోయినా తీసుకున్నట్లు రికార్డులు చూపెడుతున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకుండా పోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చొరవ తీసుకొని లబ్ధిదారులకు మంజూరైన సిమెంట్, ఐరన్ దక్కేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా నీటి సంఘాల ఎన్నికలు

అధికారులకు కలెక్టర్ శ్రీధర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో సాగునీటి వినియోగదారుల సంఘ ఎన్నికల నిర్వహణపై జిల్లా నీటి వనరుల శాఖ, మండల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వంద ఎకరాలకు పైబడి ఆయకట్టు కలిగిన చెరువులకు సంబంధించి డిసెంబర్ 8న నీటివినియోగదారుల/సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించి డిసెంబరు 5న ప్రకటన వెలువడనుందన్నారు. డిసెంబరు 8న ఒకే రోజు పూర్తి ఎన్నికల ప్రక్రియ ఉంటుందని, ఇందులో నామినేషన్ల ప్రక్రియ, 6 మంది ప్రాదేశిక సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. మైనర్, మీడియం, మేజర్ అనే మూడు కేటగిరీల నీటి వనరులకు ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలో 3 ప్రాజెక్టు కమిటీలు, 11 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 205 నీటి వినియోగదారుల కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్నిక అనంతరం ఆయా సాగునీటి సంఘాల ద్వారా రైతులు తమ చెరువులను తామే ప్రభుత్వ సహకారంతో నిర్వహించుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, డీఆర్‌ఓ శ్రీనివాసులు, జెడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఈవో మీనాక్షి, తదితరులు పాల్గొన్నారు.

నవ్వుతూ అర్జీలు స్వీకరించాలి

గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చే ప్రజల బాధను సహృదయంతో అర్థం చేసుకుని వారిని ఆప్యాయతతో పలకరిస్తూ నవ్వుతూ అర్జీలు స్వీకరించాలని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక నోడల్ అధికారి ఓబులమ్మ, పీజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో వచ్చిన గ్రీవెన్స్‌లను ఏ విధంగా పరిష్కరించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలో వివరించారు.

ఇసుక పంపిణీ ప్రక్రియ సజావుగా జరగాలి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక పంపిణీ ప్రక్రియ సజావుగా జరగాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణ అనుమతులు పొందిన సిద్ధవటం మండలంలోని గుండ్లమూల, చక్రాయపేటలోని గండికోవూరు, వియన్ పల్లి లోని తగేడుపల్లి మూడు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లకు నోటిఫికేషన్ ఇచ్చి టెండర్లు పిలిచినట్లు చెప్పారు. ఈ మూడింటికి సంబంధించి 13 టెండర్ అప్లికేషన్లు రాగా.. 11 అర్హత పొందాయని తెలిపారు. తంగేడుపల్లి ఇసుక రీచ్‌ను అంకిరెడ్డి అండ్ సన్స్ రూ. 24.50 బిడ్ ధరకు దక్కించుకుందన్నారు. మిగతా రెండు రీచ్‌లకు సంబంధించి తక్కువ ధరకు కోట్ చేసిన వాటికి నోటీసులు ఇచ్చి జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం తప్పనిసరి

పాఠశాలల పనితీరు మెరుగు పరచడంలో భాగంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ ఎంఈఓలు, ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలల మధ్య ఒక ధృడమైన బంధం ఏర్పరిచేందుకే ప్రభుత్వం పీటీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు విద్య, ప్రవర్తన పరంగా ఏ స్థాయిలో ఉన్నారో, సామాజిక అంశాల పట్ల ఎలాంటి అవగాహన కలిగి ఉన్నారో తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

కడప ఎడ్యుకేషన్: సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక గౌరవం ఉందని, దానిని ప్రతి ఒక్కరూ కాపాడుకుంటూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని డీఈఓ మీనాక్షి పేర్కొన్నారు. కడపలోని గీతం కళాశాలలో ఆరు రోజులుగా హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు శనివారం ముగిశాయి, ఈ ముంగింపు సమావేశానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలసి కట్టుగా ఉండాలని, విద్యార్థులతో సమన్వయంగా ఉంటూ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని తెలిపారు. కడప డిప్యూటీ ఈవో రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న వాటిని ఉపయోగించుకుని విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. రాయచోటి డిప్యూటీ ఈఓ శివప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు రాబోయే రోజుల్లో టెక్నాలజీ మీద అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్లు రాజగోపాల్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, విజయారెడ్డి, విశ్వనాథరెడ్డి, దశరథ రామి రెడ్డి, కేశవ రెడ్డి, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రత్యేక ఓటరు జాబితాను రూపొందించాలి

జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కన్నబాబు



మాట్లాడుతున్న జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కన్నబాబు

కడప సెవెన్‌రోడ్స్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం–2024లో భాగంగా ప్రత్యేక ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కె. కన్నబాబు ఈఆర్వోలు, ఏఈఆర్వోలను ఆదేశించారు. కడప కలెక్టరేట్‌లో శనివారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితి సింగ్‌లతో కలిసి జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కన్నబాబు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల కమిషన్ ప్రక్రియ, నిబంధనలు అమలు చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని నూతన ఓటర్లుగా నమోదులో వివరాలు.పక్కాగా నమోదు చేయాలన్నారు. బీఎల్వోలు క్షేత్రస్థాయిలో 100 శాతం ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. ప్రతి ఓటర్ల జాబితాని పరిశీలన చేయాలని, బీఎల్వోలకు శిక్షణ కూడా ఇవ్వాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు వారి ఫిర్యాదులను ముందుగానే అందించాలని, క్షేత్రస్థాయిలో నాయకులకు తెలియజేసి అందరూ సహకరించేలా చూడాలన్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి మెజారిటీ క్లైయిమ్స్, డిస్పోజల్స్ పూర్తి చేయాలన్నారు.

- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధుల నుంచి అందిన ఫిర్యాదుల విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 16,41,347 మంది ఓటర్లు ఉన్నారని, ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8కు సంబంధించి వచ్చిన క్లైయిమ్స్‌ను పరిశీలించడం జరుగుతోందన్నారు. నవంబర్ 24వ తేదీలోపు వచ్చిన క్లైయిమ్స్, అభ్యంతరాల ఫిర్యాదులను 29వ తేదీ నుండి గ్రామ పంచాయతీ, మండల, నియోజకవర్గ, రెవిన్యూ డివిజన్, జిల్లా స్థాయిలో విచారణ చేసి పరిష్కరించి.. 2025 జనవరి 1వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు చెప్పారు.సమావేశంలో డీఆర్‌ఓ శ్రీనివాసులు, కడప ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటపతి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు బాసట

- ప్రొద్దుటూరు ఏఆర్టీ సెంటర్‌లో హెచ్ఐవీ బాధితులకు మెరుగైన వైద్య సేవలు
- హెచ్ఐవీ బాధిత చిన్నపిల్లలు, గర్భిణీలకు భారతీ సిమెంట్ యాజమాన్యంచే పౌష్టికాహారం పంపిణీ
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం



ప్రొద్దుటూరులోని ఏఆర్టీ సెంటర్

ప్రొద్దుటూరు క్రైం: ఎయిడ్స్ ప్రాణాంతక వ్యాధి.. హెచ్ఐవీ బాధితులను చూస్తే జనం భూతంలా పారిపోయేవారు.. ఇదంతా ఒకప్పటి మాట. గతంలో భయాందోళనకు గురి చేసిన హెచ్ఐవీని ఇప్పుడు సాధారణ వ్యాధిలా అందరూ పరిగణిస్తున్నారు. ఈ వ్యాధిని నిర్మూలించలేకపోయినప్పటికీ దాన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వాలు విస్తృతంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. హెచ్ఐవీ నిర్ధారణ, చికిత్సలో ఏఆర్టీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో 2010లో ఏఆర్టీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా ప్రొద్దుటూరుతో పాటు మైదుకూరు, వేంపల్లె, జమ్మలమడుగు, పులివెందులలో ఐసీటీసీ (ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్) కేంద్రాలు పని చేస్తున్నాయి. ఐసీటీసీ సెంటర్లలో వివిధ రకాల పరీక్షలు నిర్వహించిన తర్వాతనే వ్యాధి నిర్ధారణ జరుగుతుంది. పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారిని ఏఆర్టీ సెంటర్‌కు పంపిస్తే అక్కడ వారి పేరును రిజిస్టర్ చేసి ఏఆర్టీ నంబర్ కేటాయిస్తారు. ఆ నంబర్ ద్వారానే బాధితులు మందులు తీసుకుంటారు. పాజిటివ్ వచ్చిన వారి రక్త నమూనాలను ఏఆర్టీ ల్యాబ్‌కు పంపించి అక్కడ సీడీ-4, వైరల్ పరీక్షలు చేసి అందులో వచ్చిన రిపోర్టు ఆధారంగా మందులు ఇస్తారు. హెచ్ఐవీ ఉన్న వారికి టీబీ కూడా సులభంగా సోకుతుంది. అందువల్ల బాధితులకు హెచ్ఐవీతో పాటు టీబీ పరీక్షలు కూడా తరచూ నిర్వహిస్తుంటారు. ఇక్కడ పని చేస్తున్న ఏఆర్టీ డాక్టర్ సూర్య నాగలక్ష్మితో పాటు సిబ్బంది పనితీరును గుర్తించిన రాష్ట్ర, జిల్లా అధికారులతో పాటు న్యాకో, ఏపీసాక్స్ సంస్థ వారు అవార్డులతో పాటు ప్రశంసా పత్రాలను అందచేశారు. డిసెంబర్ 1న 'ప్రపంచ ఎయిడ్స్ దినం' సందర్భంగా కథనం .

హెచ్ఐవీ బాధితుల పట్ల ప్రేమాభిమానులు చూపుతూ..

ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో ఏఆర్టీ సెంటర్‌కు అనుబంధంగా ప్రత్యేక హెచ్‌వీ వార్డు కూడా ఉంది. మందులు వాడుతున్నప్పటికీ వ్యాధిగ్రస్తులకు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వార్డులో చేర్పించి చికత్స చేస్తారు. గతంలో హెచ్‌వీఐ బాధితులకు చికిత్స అందించడానికి ప్రత్యేకంగా వార్డులు ఉండేవి కావు. అయితే ఇక్కడి ఏఆర్టీ అధికారుల కృషితో జిల్లా ఆస్పత్రిలో వార్డును ఏర్పాటు చేశారు. సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ సాధిక్‌బాషా సీడీ-4 మిషన్ ద్వారా పరీక్షలు చేస్తుంటారు.

అండగా భారతి సిమెంట్ యాజమాన్యం



జిల్లా ఆస్పత్రిలో భారతి సిమెంట్ యాజమాన్యం ఏర్పాటు చేసిన వాటర్ కూలర్

భారతి సిమెంట్ యాజమాన్యం హెచ్ఐవీ బాధితులకు అండగా నిలుస్తోంది. ఆస్పత్రిలోని బాధిత గర్భిణులు, చిన్న పిల్లలు, టీబీ వ్యాధి గ్రస్తులకు ప్రతి నెలా రూ. 2 లక్షలు విలువైన పౌష్టికాహాన్ని అందిస్తోంది.సుమారు నాలుగున్నర ఏళ్ల నుంచి భారతి సిమెంట్ తరపున వీరికి పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. 400 మందికి పైగా బాధితులకు ప్రతి నెలా పౌష్టికారం అందుతోంది. అంతేగాక జిల్లా ఆస్పత్రిలోని గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి, రెండో అంతస్తుల్లో ఆర్‌ఓ ప్లాంట్‌తో కూడిన వాటర్ కూలర్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ మొదటి, రెండో అంతస్తులో వార్డులు ఉన్నాయి. మంచి నీళ్ల కోసం వృద్ధులు, మహిళలు గ్రౌండ్ ఫ్లోర్‌కు వెళ్లాల్సి వచ్చేది. కూలర్లను ఏర్పాటు చేయడంతో రోగులకు అవస్థలు తప్పినట్లయింది.

హెచ్ఐవీ బాధితులకు పూర్తిగా సహకారం



ప్రొద్దుటూరు ఏఆర్టీ సెంటర్‌కు వస్తున్న హెచ్ఐవీ బాధితులకు అన్ని విధాలుగా సహకరిస్తున్నాం. వారికి కావలసిన మందులు ఇవ్వడంతో పాటు సీడీ-4, వైరల్ లోడ్ పరీక్షలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నాం. తదనుగుణంగా మందులను మార్చి ఇస్తున్నాం. మా సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సర్వీసును అందిస్తున్నారు. హెచ్ఐవీ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. హెచ్ఐవీ నియంత్రణ మన చేతుల్లోనే ఉంది.

– డాక్టర్ సూర్యనాగలక్ష్మి,
ఏఆర్టీ సెంటర్ వైద్యాధికారి, ప్రొద్దుటూరు

నియంత్రణలో హెచ్ఐవీ..





కడప రిమ్స్‌లోని ఏఆర్‌టీ సెంటర్

కడప రూరల్: గడిచిన ఐదేళ్లలో వైద్య ఆరోగ్య శాఖ గట్టి చర్యలు చేపట్టడంతో హెచ్ఐవీ కేసులు తగ్గుముఖం పట్టాయి. 1980కు ముందు..తరువాత ఈ వ్యాధి గురించి తెలియక..అవగాహన లేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. క్రమేణా పరిస్థితుల్లో కాస్త మార్పులు వచ్చాయి. ఫలితంగా బాధితుల సంఖ్య తగ్గు ముఖం పడుతూ వచ్చింది. అయినా కూడా హెచ్ఐవీ తాను ఉన్నానంటూ ఉనికిని చాటుతూనే ఉంది. జిల్లాలో అనధికారికంగా 1986లో, అధికారికంగా 2001-2002లో ప్రథమ కేసును గుర్తించారు. ఈ కేసులు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నమోదయ్యాయి. బాధితుల సంఖ్య గ్రామాల్లో కంటే పట్టణాల్లోనే ఎక్కువగా కనిపించింది. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల తదితర ప్రధాన పట్టణాల్లో కేసులు అధికంగా నమోదయ్యాయి. కాగా 2001-2002లో 584 మందికి హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేశారు. అందులో 114 మందిలో వ్యాధి ఉన్నట్లుగా గుర్తించారు. తరువాత 2005-2006 నుంచి 2009-2010వ సంవత్సరం వరకు కేసులు సంఖ్య పెరుగుతూ వచ్చింది. అనంతరం కాస్త తగ్గ తగ్గుముఖం పట్టింది. మళ్లీ 2015-2016 నుంచి 218-2019 వరకు కేసుల సంఖ్య పెరగడంతో ఆందోళన నెలకొంది. తరువాత 2019-2020 నుంచి కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టడం శుభపరిణామం. తాజాగా హెచ్ఐవీ బాధితులకు ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా ఉచితంగా మందులను వాడుతున్నారు.

జిల్లాలో హెచ్ఐవీ కేసుల వివరాలు

ఏడాది	పరీక్షలు చేయించుకున్న అనుమానితులు	పాజిటివ్ కేసులు	అనుమానిత గర్భిణీలు	పాజిటివ్ కేసులు
2015-16	70,285	915	45,260	49
2016-17	71,210	969	61,586	36
2017-18	76,759	997	50,346	40
2018-19	1,17,746	818	61,361	41
2019-20	92,256	816	64,806	37
2020-21	40,562	404	55,448	36
2021-22	80,804	559	66,068	35
2022-23	1,20,979	665	74,829	26
2023-24	1,16,986	518	75,051	28
2024 (అక్టోబరు వరకు)	75,636	327	78,317	10

ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది నా ఆరోగ్యం.. నా హక్కు అనే నినాదంతో కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా డిసెంబరు ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలలో హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాలను నిర్మూలిస్తున్నట్టు చెప్పారు. 2030 నాటికి పూర్తిగా నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం హెచ్ఐవి పాజిటివ్ పేషెంట్స్ కు నెలకు ఒకరికి రూ 4 వేలు చొప్పున పింఛన్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్స్ మరియు డెమో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో ఉద్రిక్తత

- టిడ్కో ఇళ్లపై ఎమ్మెల్యేకు సమాధానం ఇచ్చిన వైస్ చైర్మన్
- మహిళా కౌన్సిలర్‌పైకి దూసుకొచ్చిన మురళీధర్‌రెడ్డి
- పోలీసుల రంగప్రవేశంతో సర్దుబాటు


వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ లక్ష్మీదేవి వద్దకు దూసుకొచ్చిన టీడీపీ కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ బంగారురెడ్డి, పాల్గొన్న కౌన్సిలర్లు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో అనుకోకుండా ఏర్పడిన పరిస్థితుల కారణంగా.. ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అడిగిన ప్రశ్నకు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈలోపుగా ఐదో వార్డు టీడీపీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి.. 10వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి వద్దకు దూసుకురావడంతో పోలీసులు రంగప్రవేశం చేసి సర్దుబాటు చేశారు. ఇరువురి వాగ్వాదం కారణంగా మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన సమావేశం ప్రారంభం కాగా అజెండాలోని అంశాలను చదువుతూ వచ్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, పాతకోట మునివంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కడప అర్బన్ డెవలప్‌మెంట్ కింద మంజూరు చేసిన ఎంఐజీ ప్లాట్ల ఏర్పాటు ఎంత వరకు వచ్చిందని ప్రశ్నించారు. ఈ ఇళ్ల నిర్మాణం కోసం చాలా మంది ఉద్యోగులు 25 శాతం డబ్బు చెల్లించి అయోమయంలో ఉన్నారన్నారు. దీనిపై సమాధానం చెప్పాలని కమిషనర్ మల్లికార్జునను కోరారు. సమావేశానికి ఎక్స్ అఫిషియో మెంబర్ హోదాలో హాజరైన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఈ సందర్భంగా జోక్యం చేసుకుంటూ గత చంద్రబాబు ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఎందుకు కూల్చేశారని ప్రశ్నించారు. సామగ్రి ఏమైందని అడిగారు. ఈ విషయంపై మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క టిడ్కో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయలేదన్నారు. 4 వేల ఇళ్లు మంజూరు కాగా 300 ఇళ్లను నిర్మించారని, వాటిలో కూడా సౌకర్యాలు కల్పించలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక లబ్ధిదారుల కోరిక మేరకు వారు చెల్లించిన సొమ్మును తిరిగి ఇచ్చామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కడప అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులు డిప్ ద్వారా ప్లాట్లు కేటాయించారన్నారు. ఎక్కడా అవినీతికి చోటు లేదని తెలిపారు. నిబంధనల ప్రకారమే టిడ్కో ఇళ్ల పునాదులను అధికారులు తొలగించారన్నారు. వచ్చే సమావేశానికి సంబంధిత అధికారులను హాజరుపరిస్తే అన్ని విషయాలు తెలుస్తాయని అన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగానే టిడ్కో ఇళ్లను కూల్చారని అన్నారు. సంబంధిత అధికారులు వస్తే అన్ని విషయాలు తెలుస్తాయని, అవసరమైతే విచారణ చేయించుకోవచ్చునని బంగారు మునిరెడ్డి పేర్కొన్నారు. బంగారు మునిరెడ్డి మాటలతో ఎమ్మెల్యే ఏకీభవించకపోవడంతో ఇరువురి మధ్య మాటకుమాట పెరిగింది.

అర్ధాంతరంగా ముగిసిన సమావేశం

ఎమ్మెల్యే, మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతుండగా టీడీపీ ఐదో వార్డు కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి టిడ్కో ఇళ్లకు సంబంధించిన కడ్డీలను అమ్ముకున్నారని మాట్లాడారు. పదో వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో 24 వేల ఇళ్లను మంజూరు చేయించామని అన్నారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి, బంగారు మునిరెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కౌన్సిల్ సభ్యులందరూ లేచి నిలుచున్నారు. ఈ సందర్భంగానే మురళీధర్‌రెడ్డి అవతలి వైపు ఉన్న తన సీటు నుంచి ఆవేశంగా మహిళల వరుసలో ఉన్న గరిశపాటి లక్ష్మీదేవి వద్దకు వేగంగా దూసుకొచ్చారు. దీంతో సమావేశంలో మరింత ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. మహిళా కౌన్సిలర్ అయిన తనపైకే వస్తావా అంటూ గరిశపాటి లక్ష్మీదేవి ప్రశ్నించారు. ఆ లోపే పోలీసులు ఆమెకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తనపైకి వచ్చిన మురళీధర్‌రెడ్డిని అడ్డుకోకుండా తన వద్దకు రావడం ఏమిటని ఆమె పోలీసులను ప్రశ్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్ధాంతరంగా సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్‌ఖాజా, వైఎస్సార్‌సీపీ కౌన్సిలందరూ చైర్‌పర్సన్ చాంబర్‌లోకి వెళ్లారు. కొద్ది సేపు తర్వాత ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తమ కౌన్సిలర్లతో సమావేశం నుంచి వెళ్లిపోయారు. దీంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. అంతకుముందుగా సమావేశంలో పలు అంశాలను చర్చించి ఆమోదించారు.

మహిళా కౌన్సిలర్‌పైకి రావాల్సిన అవసరం ఏమిటి?

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవిపైకి టీడీపీ కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి దూసుకురావాల్సిన అవసరం ఏమిటని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ప్రశ్నించారు. ఆమె తన చాంబర్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. గతంలో కూడా మురళీధర్‌రెడ్డి ఇలాగే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్నారు. ప్రశాంతంగా జరుగుతున్న కౌన్సిల్ సమావేశాన్ని గొడవకు దారితీసేలా చేశారన్నారు. కౌన్సిలర్లందరం గతంలో ఒక్కటిగా ఉన్నాం, ప్రస్తుతం వారి అభీష్టం మేరకు పార్టీలు మారిపోయారన్నారు. అయితే ఎక్కడా సమస్య లేకుండా సమావేశాలు జరిగిపోతున్నాయన్నారు. మురళీధర్‌రెడ్డి తన సీటులో నుంచి మహిళా కౌన్సిలర్ వైపు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. మరో మారు కౌన్సిలర్ ఇలాగే వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

‘ప్రకృతి అభియాన్’ యాప్‌తో ప్రయోజనం

కడప అర్బన్ : ‘దేశ్‌కీ ప్రకృతి పరీక్షన్ అభియాన్’ యాప్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రచారం విస్తృతంగా నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి అన్నారు. శనివారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణ న్యాయసేవాసదన్‌లో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ‘దేశ్ కీ ప్రకృతి పరీక్షన్ అభియాన్’ అనే యాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా తమ శరీర తత్వం, స్వభావం తెలుస్తుందన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు వాటిని అనుసరించి సుఖమైన జీవనశైలిని రూపొందించుకోవచ్చని తెలిపారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆర్‌డీడీ డాక్టర్ శేఖర్ రాజు, జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ మురళీబాబు మాట్లాడుతూ శరీరం రోగాలమయం కాకుండా ఆయుర్వేదం ద్వారా కాపాడుకోవచ్చన్నారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, న్యాయమూర్తులు ప్రత్యూష, ప్రవీణ్‌కుమార్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు ఆయుష్ విభాగం వారి సూచనల మేరకు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ ఎస్. రామమూర్తి నాయక్, డాక్టర్ పరిమళ, ఫార్మసిస్ట్ జి.రాజశేఖర్, సుమంత్ పాల్గొన్నారు.


యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు

క్లుప్తంగా

మెట్లపై నుంచి పడి వ్యక్తి మృతి


బ్రహ్మయ్య (ఫైల్)

వీరపునాయునిపల్లె : మండల పరిధి అనిమెల గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో మెట్ల పైనుంచి కింద నుండి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలలోకి వెళితే .. గ్రామానికి చెందిన బత్తల బ్రహ్మయ్య(40)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శనివారం ఉదయం తేలికపాటి వర్షం కురుస్తుండటంతో నాలుగవ తరగతి చదువుతున్న కుమారుడు మల్లికార్జునను పాఠశాలలో వదిలేందుకు వెళ్లాడు. పైన ఉన్న తరగతి గదిలో పిల్లవాడిని వదిలి.. మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు కుటుంబీకులు తెలియజేశారు.

ట్యాంకర్ ఢీకొని అధ్యాపకుడి దుర్మరణం


మల్లికార్జునరాజు (ఫైల్)

ఎర్రగుంట్ల : మండల పరిధి పోట్లదుర్తి గ్రామంలోని శివాలయం వద్ద శనివారం ఫ్లైయాష్ ట్యాంకర్ ఢీకొని అధ్యాపకుడు దుర్మరణం చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన మల్లికార్జునరాజు(40) ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేసే వారు. రోజూ మాదిరిగానే ఉదయం ప్రొద్దుటూరులోని ఇంటి వద్ద నుంచి కళాశాలకు స్కూటర్‌లో బయలుదేరారు. పోట్లదుర్తి గ్రామ సమీపంలోని శివాలయం వద్దకు రాగానే ఫ్లైయాష్ ట్యాంకర్ వచ్చి ఢీకొంది. ఈ ప్రమదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య ఉషతోపాటు ఇద్దరు సంతానం ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చైన్ స్నాచింగ్

సింహాద్రిపురం : సింహాద్రిపురంలో శనివారం సాయంత్రం బైకుపై ఇద్దరు వచ్చి మహిళ మెడలో బంగారు చైన్‌లను లాక్కెళ్లిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక వైఎస్ రాజారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కామర్స్ లెక్చలర్‌గా పని చేస్తున్న ఖైరున్నీషా చెత్త సేకరణ కేంద్రం వద్ద బస్సు కోసం వేచి ఉంది. ఈ సమయంలో ఆమె మెడలో ఉన్న రెండు బంగారు చైన్‌లను ఇద్దరు వచ్చి లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మా స్థలాలు తీసుకునేందుకు మీరెవరు?

టీడీపీ దౌర్జన్యాలను అడ్డుకున్న స్థానికులు


పట్టాలతో ఆందోళన చేస్తున్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పులివెందుల పట్టణంలోని కోతి సమాధి ఆలయం సమీపంలో ఉన్న డీకేటీ స్థలాలను టీడీపీ నాయకులు ఆక్రమించేందుకు సిద్ధమవ్వడంతో స్థానికులు అడ్డుకున్నారు. శనివారం పట్టణంలోని స్థానిక రాజారెడ్డి కాలనీ సమీపంలో ఇళ్ల పట్టాల లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో కాంగ్రెస్ పార్టీ పాలనలో నిరుపేదలకు స్థలాలు ఇవ్వడం జరిగిందని.. అందుకు సంబంధించిన పత్రాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. రెవెన్యూ అధికారులు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో గుంతగా ఉన్న తమ స్థలాలను చదును చేసుకునేందుకు ఎంతో కష్టపడ్డామన్నారు. అయితే కొంతమంది అధికారాన్ని అడ్డుపెట్టుకొని దౌర్జన్యానికి దిగుతున్నారని మండిపడ్డారు. తమ స్థలాలు కాజేయాలని చూస్తే సహించేది లేదని.. అందుకోసం దేనికైనా సిద్ధంగా ఉన్నామని మహిళలు పేర్కొన్నారు. సీఐ పిలిపించి బెదిరిస్తున్నారని ఇళ్ల పట్టాల లబ్ధిదారులు వాపోయారు. తమ స్థలాల్లో ఇళ్లకు సంబంధించి బేస్‌మట్టాలు వేసుకున్నామన్నారు. తమకు సంబంధించిన స్థలాలు తీసుకోవడానికి మీరెవరని మండిపడ్డారు. ఈ స్థలాల విషయమై పోలీస్ అధికారులు కూడా పిలిపించి సర్ది చెప్పే ప్రయత్నం చేశారన్నారు. ఎంతో కొంత డబ్బు తీసుకుని ఆ స్థలాలు ఇవ్వాలని పోలీస్ అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా పులివెందుల పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయ సమీపంలో విలేకరుల కోసం ఇస్తున్న స్థలాలను కూడా టీడీపీ నాయకులు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. పులివెందుల పట్టణంలో ఎక్కడ డీకేటీ స్థలాలు ఉన్నాయో వాటిని ఆక్రమించుకునేందుకు టీడీపీ నాయకులు ఎత్తుగడలు వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వీరిని అడ్డుకునేవారు ఎవరూ లేరా అని వారు ప్రశ్నించారు. తమ స్థలాలు ఆక్రమించాలని చూస్తే సహించేది లేదని, ఎంతవరకైనా పోరాడతామని పేర్కొన్నారు.

మా స్థలాలకు పట్టాలు ఉన్నాయి



2014లో మాకు ప్రభుత్వం ద్వారా ఇంటి పట్టాలు మంజూరయ్యాయి. మా స్థలాల్లో చదును చేసుకుని పునాదులు వేసుకున్నాం. పదేళ్లుగా మా స్థలాలపై ఎటువంటి అభ్యంతరం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొంతమంది మా స్థలాలంటూ పోలీసుల ద్వారా బెదిరిస్తున్నారు. అందుకు సంబంధించి పట్టాలు మా దగ్గర ఉన్నాయని, లేనిపోని అబద్ధాలు చెబుతున్నారు. ప్రభుత్వం మాకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి న్యాయం చేయాలి. – రమణమ్మ, ఇళ్ల పట్టా లబ్ధిదారురాలు, పులివెందుల

మాకు న్యాయం చేయండి



మా స్థలాల వద్దకు ఎవరో వచ్చి మావి అంటుంటే ఎలా ఇస్తాం. మా ఇంటి స్థలాలకు సంబంధించి రెవెన్యూ అధికారులు ఇచ్చిన పత్రాలు మా దగ్గర ఉన్నాయి. ప్రస్తుతం కొంతమంది వ్యక్తులు వచ్చి మా స్థలాలు అంటూ బెదిరిస్తున్నారు. మాకు ప్రభుత్వం న్యాయం చేయాలి. – అమరావతి, ఇళ్ల పట్టా లబ్ధిదారురాలు, పులివెందుల

ముగిసిన అండర్-23 క్రికెట్ పోటీలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో పది రోజులుగా నిర్వహించిన ఏసీఏ అంతర్ జోనల్ అండర్-23 వన్డే క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. టోర్నమెంట్ ముగిసే సమయానికి రెస్టాఫ్ సౌత్‌జోన్ 12 పాయింట్లు, తూర్పుగోదావరి 12 పాయింట్లతో పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచాయి. సెంట్రల్‌జోన్ 8, ప్రకాశం 4, నార్త్‌జోన్ 4 పాయింట్లు చొప్పున సాధించాయి. కాగా చివరి రోజు శనివారం నిర్వహించిన మ్యాచ్‌లు తొలి ఇన్నింగ్స్ మాత్రమే పూర్తవగా, వర్షం కారణంగా మ్యాచ్‌లు నిలిచిపోవడంతో, ఫలితం తేలకపోవడంతో చెరో పాయింట్ కేటాయించారు.

పర్యాటకుల వాహనంపై దాడి

- ఫిర్యాదు చేసిన బాధితులు
- గుడారాల ఆధిపత్య పోరే కారణం


అద్దం దెబ్బతిన్న కారు

జమ్మలమడుగు : గ్రామంలో అనధికార గుడారాలు వేయడంపై రెండు వర్గాల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరుతో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు పర్యాటక కేంద్రమైన గండికోటకు శుక్రవారం వచ్చారు. వీరు ఏసీ రూములను బుక్ చేసుకున్నారు. అయితే గ్రామంలో టెంట్ల విషయంలో రెండు వర్గాల మధ్య గొడవ ప్రారంభమైంది. శనివారం ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు గండికోటలో ఉన్న పర్యాటక ప్రాంతాలను చూసి తిరిగి వచ్చారు. అప్పటికే తమ వాహనానికి సంబంధించిన అద్దాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో బాధితులైన శ్రీకాంత్, చేతన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు. గ్రామంలో ఉన్న వారే రెండు వర్గాలుగా విడిపోయి కారు అద్దాలు పగులగొట్టినట్లు తెలిపారని పోలీసులు పేర్కొంటున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బాధ్యులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని సీఐ లింగప్ప పేర్కొన్నారు.

సున్నపురాళ్లపల్లి విద్యార్థికి బంగారు పతకం


పతకం అందుకుంటున్న పృథ్వినాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లి గ్రామానికి చెందిన బూచిపల్లి పృథ్వినాథ్‌రెడ్డి బంగారు పతకం అందుకున్నారు. ఈ మేరకు శనివారం గుంటూరు జిల్లా వడ్డేశ్వరం కే ఎల్ డీమ్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో 14వ స్నాతకోత్సవం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ హాజరయ్యారు. పృథ్వినాథ్‌రెడ్డి బీటెక్ (బయోటెక్నాలజీ)లో 2023–24 విద్యా సంవత్సరానికి 9.5 జీపీఏ సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ సమయ స్ఫూర్తితో తప్పిన ప్రమాదం

- గుండెపోటు రావడంతో బస్సు నిలిపివేత
- ప్రయాణికులు సురక్షితం

ఖాజీపేట : ఆర్టీసీ బస్సు డ్రైవర్ సమయ స్ఫూర్తితో వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. తనకు గుండె రావడంతో.. బస్సును సమీపంలోని బస్టాండ్‌లో నిలిపివేయడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రయాణికులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట టౌన్‌కు చెందిన జాఫర్ హుసేన్(62) ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం విధుల్లోకి వచ్చారు. రాత్రి కడప డిపోలో బస్సు ఉంచారు. శనివారం తెల్లవారుజామున కడప బస్టాండ్ నుంచి ప్రొద్దుటూరుకు బయలుదేరాడు. అయితే గుండె భాగంలో కొద్దిగా నొప్పి వస్తున్నా పట్టించుకోకుండా నడుపుకొంటూ వచ్చారు. ఖాజీపేట సమీపంలోకి వచ్చే సరికి నొప్పి తీవ్రత అధికమైంది. దీంతో డ్రైవర్ కంగారు పడితే బస్సులో ఉన్న సుమారు 40 మంది ప్రయాణికులు ఇబ్బంది పడతారని భావించారు. ఖాజీపేట బస్టాండ్ వరకూ వచ్చి బస్టాండ్‌లో బస్సును నిలిపారు. అప్పటికే నోటి నుంచి రక్తం వస్తుండటంతో అందరూ తీవ్రంగా భయపడ్డారు. వెంటనే 108కి ఫోన్ చేయడంతో అక్కడికి వాహనం వచ్చింది. ఈ లోగా ఇంటికి సమాచారం ఇవ్వడంతో కుమారుడు బస్సు వద్దకు చేరుకున్నారు. వెంటనే అక్కడి నుంచి 108 వాహనంలో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కొద్ది సేపటికి మరొక డ్రైవర్ అక్కడికి వచ్చి బస్సును తీసుకు వెళ్లారు. చికిత్స పొందుతున్న జాఫర్ హుసేన్ ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులతో పాటు తోటి డ్రైవర్లు సంతోషం వ్యక్తం చేశారు.

బూడిద దోపిడీకి సీఎం స్థాయిలో పంచాయితీ

- చెన్నై, బెంగళూరుకు ఇసుక తరలింపు
- ప్రజా సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్‌టీపీపీ)లో వచ్చే బూడిదను తరలించేందుకు ముఖ్యమంత్రి స్థాయిలో పంచాయితీ చేసే దుస్థితి రావడం విచారకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. శనివారం వైఎస్సార్‌సీపీ ఇక్కడి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఎంతో ఘనంగా హామీలిచ్చిన కూటమి, అధికారంలోకి వచ్చి ఆరునెలలవుతున్నా ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. ఏ ప్రభుత్వ శాఖలోనూ ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను, సోషల్ మీడియా యాక్టివిస్టులను వేధించడమే వీరి పనా.. మిగతా ఏ పనులు లేవా.. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్య ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. సిమెంటు పరిశ్రమలు, చిన్న పరిశ్రమలకు తరలించాల్సిన ఫ్లైయాష్‌ను మాకంటే మాకని తాడిపత్రి, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు పోటీలు పడి పంతాలకు పోవడం దారుణమన్నారు. ఐదారు రోజులుగా డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు ఆర్‌టీపీపీ వద్ద కాపలా కాసే పరిస్థితి దాపురించిందన్నారు. పక్క జిల్లా నుంచి దండయాత్రగా రావడాన్ని బట్టి చూస్తే శాంతిభద్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుందన్నారు.

ఏ ఒక్క శాఖ సక్రమంగా పని చేయడం లేదు

ఇసుక, మట్టి రవాణా విషయంలో కూడా టీడీపీ నేతలు అక్రమార్జన చేస్తున్నారని, ఇసుకను బెంగళూరు, చెన్నై నగరాలకు తరలిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. శ్రీశైలం జలాశయంలో విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని సముద్రం పాలు చేస్తున్నారన్నారు. తుపానులతో రైతులు ఖరీఫ్ సీజన్ నష్టపోయారని, సాగునీరు లేకపోవడం వల్ల రబీ పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. రైతుల భూమి సమస్యల పరిష్కారానికి వెబ్‌సైట్లు కూడా పనిచేయడం లేదన్నారు. ఏ ఒక్క ప్రభుత్వ శాఖ సక్రమంగా పని చేయడం లేదన్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, ఈ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, బీహెచ్ ఇలియాస్, ఎస్‌ఏ కరిముల్లా, సీహెచ్ వినోద్ కుమార్, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోలీసు క్రీడలు



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో క్రీడా పోటీల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : కడపలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రెండు రోజులుగా పోలీస్ క్రీడలు–2024 ఉత్సాహంగా జరుగుతున్నాయి. వైఎస్‌ఆర్ జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు పాల్గొంటున్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ వి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ మురళీధర్ శనివారం పోటీలను పర్యవేక్షించారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ విభాగంలో పరుగుపందెం, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, క్రికెట్, షటిల్, టగ్ ఆఫ్ వార్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు.

మట్టికోసం తవ్వుతుంటే బయటపడ్డ గుహ


కొండలో ఉన్న గుహ

కొండాపురం : కొండాపురం మండల పరిధిలోని ముచ్చుమర్రి శివాలయం సమీపంలోగల కొండలో మట్టిని తవ్వుతుండగా గుహ బయటపడింది. రెండు నెలల కిందట జాతీయ రహదారి పనుల్లో భాగంగా ఈ ప్రాంతంలోని మట్టి, గ్రావెల్‌ను తరలించారు. ఈ క్రమంలో శనివారం గుహను స్థానికులు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు మండల తహసీల్దార్ గుర్రప్ప దీనిని పరిశీలించారు. ఈ గుహ పొడవుగా, పెద్దగా ఉండటంతో స్థానిక ప్రజలు ఆ ప్రాంతాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.